
# ఓ లేఖ

సాయంత్రం కిటికీ దగ్గర నిలబడింది రాధ. ఆకాశం దట్టమైన మేఘాలతో బరువుగా ఉంది. భారంగా ఉంది. రాధ గుండెలాగే. రాధ చేతిలో ఒక జ్ఞాపకం. అది రాధని ఎగతాళి చేస్తున్నట్లుగా ఉంది. ఆలోచిస్తే, ప్రతిమనిషి గుండె ఒక జ్ఞాపకాల గూడేనేమో! ఆ గూడులోని ఏ జ్ఞాపకం ఎటువంటి అనుభూతిని స్తుందో, ఏ అనుభూతి గుండెను రగిల్చి, మసిచేసి వదిలి పెడుతుందో తెలియని విషయం. తెలియరాని విషయం.

రాధచేతిలోని ఆ పెద్ద ఉత్తరంలో ఎంతనా జూకయిన అక్షరాలు! ఆ అక్షరాలలో ఇమిడియున్న ఆ భావాలు ఇంకెంత మధురమైనవి! ఆ కలలు ఇంకెంత మత్తయినవి.




ప్రియమైన రాధా!

సముద్రపు ఒడ్డున అందరికీ దూరంగా, ఏకాంతంలో, మసకచీకటిలో, బిగి కౌగిలిలో వేడిని పెదవులపైన కమ్మని ముద్దు ఊహించుకుంటూ, ఇది ఈవేళప్పుడు మొదలుపెట్టేను.

ఆ సమయంలో 'మనం ఎప్పుడూ ఇలాగే ఉండిపోతే' అంటావు నువ్వు. ఎంత బాగుంటుంది. కాని.... వాస్తవంలో ఆ అనుభూతి తాత్కాలికమే కదా! కాబట్టి అన్ని కలలూ, ఊహలూ ఈ లేఖలోనే అవే తృప్తి మనకు అవునా?

నీవు రాసిన లేఖ చదువుతున్నంతసేపూ, ఏదోలోకంలో ఏకాంతంగా, నీతోవుండి, నీమెత్తని గుండెలమీద తల ఆన్చి, నీ కళ్ళల్లోకి చూస్తూ, నీ పెదవులని తాకుతూ, ఆనంద డోలికలలో ఉండి, నీవు చెప్పే తీయని కబుర్లు వింటున్నట్లుంది.

నీ లేఖలోని మాటలు మళ్ళామళ్ళా మననం చేసుకుంటున్నాను. మనసుని ఒక పరిధిలో సంకుచితంగా ఉంచక, దానికి రెక్కలు ఇచ్చి, ఎంత విశాలంగా వెళ్ళగలిగితే, అంతవరకూ పంపవచ్చు. ఏ క్షణంలో దేనివల్ల ఎంత సుఖానుభూతి లభిస్తే, ఆ అనుభూతి, ఆ సమయంలో అనుభవించటమే న్యాయం. ఆ సమయంలో మాట తప్పొప్పులను గురించి, న్యాయాన్యాయాలగురించి ఆలోచించి, ఆ మానసికానుభూతిని దూరం చేసుకోవటం న్యాయంకాదు. ఇట్లా.

నిజానికి నాకీ మాటలు చాలా నచ్చేయి రాధా! నా స్వంత సిద్ధాంతానికి ఎంత వాస్తవంగా అన్పించేయో, చెప్పటానికి భాషచాలదు అనిపిస్తోంది.

ఒక విధంగా జీవితాన్ని 'ఎనలైజ్' చేసి పరిశీలిస్తే, వాస్తవంలో ప్రతీవ్యక్తి మనసులోనూ, అదే భావం ఉంటుందనుకుంటా. ఎటొచ్చీ సమాజానికి, చుట్టుపట్ల వాతావరణానికి, కొన్ని బంధాలకు కొందరు వ్యక్తులకు లొంగి ఉండటంవల్ల ఆచరణలో అవి పైకి రావు. అణగగొట్టబడతాయి. అలా అణగగొట్టటం వలన మానసిక బలహీనత ఉన్నవారికి అది వికటిస్తుంది. మూర్ఛరోగాలూ, హిస్టీరియాలు, అతి కోపాలూ, జెలసీ, క్రూరత్వం, దీర్ఘరోగాల రూపంలో ఫలిస్తాయి. కాబట్టి రెక్కలిచ్చి ఎగరనివ్వటమే ఆరోగ్యలక్షణం.

వయసులో చిన్నదానవు అయినా, మెచ్యూరిటీ కన్విక్షన్స్ ఉన్నాయి నీలో. అందుకే మానసికంగా నాకు చాలా సన్నిహితంగా వచ్చేవు.

వివాహం పేరిట సాంఘిక అవసరాలకోసం ఎవరినో కట్టుకోవటం వేరు. అటువంటి వారి మధ్య అనిర్వచనీయమైన ప్రేమ అభివృద్ధి కావచ్చు. కాని మనసులు కలియటం వేరు. నా దృష్టిలో మనసులు ఒకటిగా ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. ఇలా నమ్మకాలు ఒకటయి, మనసులు ఏకమైనప్పుడు, వారి మధ్య దాపరికాలు ఉండే అవకాశంలేదు. మానసిక సాన్నిహిత్యం చాలా అరుదైన అనుభూతి రాధా! అది లేకుండా అది ఏమిటో తెలియకుండా, శరీరాలు ఏకం కావచ్చు. హృదయాలు ఏకం కావచ్చు. అందులో కొంతవరకూ 'హిపోక్రసీ' ఉంటుంది. అయితే సమాజానికి, సమాజ బంధాలకు చాలా అవసరం. ఎందుచేతనంటే సమాజం మనుగడ దానిపైనే ఆధారపడి ఉంది. అయితే 'కన్విక్షన్స్' ఒకటయి మనసు సాన్నిహిత్యం ఏర్పడినప్పుడు, శరీర సాన్నిహిత్యాన్ని కోరటం స్వభావ సిద్ధం.

ఉదాహరణకు ఇద్దరి మనసులు సన్నిహితమైనప్పుడు అందులో ఇమిడివున్న ఇతర ఆకర్షణలన్నీ వారిమధ్య పరమ రహస్యాలుగా ఉండిపోతాయి. ఉండిపోవాలి కూడా. సమాజానికి అంతుపట్టకుండా ఈ సోది అంతా దేనికి అంటున్నావా?

అయితే ఇది ఇప్పటికి ఆపేస్తాను. నీతో నా కలల ప్రపంచంలో ఎలా గడుపుతున్నావో రాయమంటావా పోనీ రాస్తాను. కానీ రెచ్చగొట్టి వదిలివేసినట్లవుతుందేమో మరి... తట్టుకోగలవా?

ఆఫీసు అయ్యేక మేడమీద గదిలో ఒంటరిగా

# ఓ లేఖ

వాలుకుర్చీలో, నేనూ నా చుట్టూ రకరకాల పుస్తకాలు. మేగజైన్స్, గోడమీద చిత్రపటాలు. ఎదురుగా గోడమీద ఒక కేలండరు బొమ్మ. చాలా అందమైన పాతికేళ్ళ అమ్మాయి. స్నానం చేసి, తడిబట్టలతో పక్కవాటుగా అందమైన పోజులో కూర్చుని పలకరిస్తున్నట్లుగా చూస్తున్నది. ఆమె వెనుక నా మట్టుకు నాకు నువ్వు కనిపించి మాయమవుతున్నట్లు అన్పిస్తుంది. ఇంతకన్నా వెర్రి భ్రమ మరొకటి ఉండదుకదా!

నా మనసులో మనసు కలిపివేయటానికి తలను తలను చేర్చి, హృదయంలో హృదయం చేర్చటానికి గుండెలను గుండెలకదిమి, మాటలో మాట కలపటానికి పెదవులకు పెదవులను ఒత్తి శరీరంలో ప్రతీ అణువూ స్పృశించి, అనిర్వచనీయమైన స్వర్గసుఖాలు సృష్టించుకుంటూ, ఆనందానుభూతిని పొందుతున్నది నా మనసు. నీతో పంచుకుంటున్న నాకీ కలలే తృప్తినిస్తున్నాయి రాధా! ఇంకా కలలు కనమంటున్నాయి. రాస్తే తిడతావేమో!

ఒక కలలో నేను తీర్చుకుంటున్న కోరిక. చేతులు చాస్తే నా ఒడిలో వచ్చి వాల్తావు. అదే ఊహిస్తున్నాను.

అలా ఈ క్షణంలో నా ఒడిలో వాలావు. నిన్ను గట్టిగా వాటేసుకున్నాను. నీ చెదిరిన ముంగురులను సవరించి నీ పెదవులను గాఢంగా ముద్దు పెట్టుకున్నాను. ఎంత కమ్మని అనుభూతి అది భరించలేక నన్ను నువ్వు కోప్పడ్డావు. ఆ తర్వాత నవ్వేసావ్. ఆ నవ్వులో గల అనురాగాన్ని భరించలేక ఆ నవ్వునే ముద్దుపెట్టుకున్నాను.

నీ అమృత మధురాధరాలు వల్లె వేసుకునే భావాలలో ఇమిడివున్న మాటల మాలకోసం, ఎదురుచూస్తూ ఈ మాలను అల్లుతున్నాను. నా ఊహల ప్రపంచంలో నిర్మించుకునే ఈ ప్రేమాలయమనే మనోఫలకంలో గల నీ మూర్తి మెడలో వేసుకోవటానికి.

నాకా సమయంలో ఏమి జ్ఞాపకం వస్తున్నదో తెలుసా? ఆముక్తమాల్యద, కృష్ణదేవరాయలు రాసిన అతి గొప్ప ప్రబంధకావ్యం. పూల దండను గుచ్చి మొదట తానే అలంకరించుకుని, తర్వాత ప్రియమైన వారి మెడలో వేయటం. చాలా గొప్ప భావం కదూ! అటువంటిపని ఒకామె చేస్తూ ఉండేది. ఆమే ఆండాల్, అనగా గోదాదేవి. ఆ కావ్యం ఆమె కథ.

రాధా! నీకు ఇలా లేఖ రాస్తుంటే నాకేమి అన్పిస్తున్నదో తెలుసా? మన పురాణాలలోని రాధాకృష్ణుల ప్రేమానురాగాలు మళ్ళా నాకు జ్ఞాపకం వస్తున్నాయి.

రాధాకృష్ణులలో రాధ పెద్దది. అయినా వారి మధ్య ప్రేమ సాటిలేనిది. అయితే ఇక్కడ కృష్ణుడే పెద్దనుకో. ఇది గమ్మత్‌గా లేదూ!

ముఖ్యంగా మన మనోభావాలలోని, నీకూ, నాకూ ఏర్పడిన అనురాగ బంధాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే, వెనుకటి ఆ రాధాకృష్ణుల గాఢానురాగం నిజమేననిపిస్తోంది. ఈ రకమైన ప్రేమానుబంధం ఏ ప్రేమికుల మధ్య సాధ్యం కాదేమోననిపిస్తోంది.

మెత్తని నీ ఒడిలో తలదూర్చి, సున్నితమైన నీ భావాలలో లీనమై, నీవిచ్చే స్పర్శసుఖంలో, ఒళ్ళు మరచి, ఆనందం అనుభవిస్తున్నాను. ఆ ఆనందంలోనే ఎన్నో కలలు కంటున్నాను. ఈ కలలకు అంతులేదు.


ఇక ఈ మహాభారతంలో ఈ పర్వాన్ని ముగిస్తాను. లేకుంటే నీకు కోపం వచ్చేస్తుంది. ఆ కోపంలో నాకు లేఖలు రాయటం మానేస్తావు.

సెలవు తీసుకునే ముందు నీకేం కావాలి? నీకేమి కావాలో అదే ఇస్తున్నాను. అత్యంత మధురమైన నీ పెదవులను ముద్దాడి, నిన్ను గట్టిగా గుండెలకదుముకుని, నీ మనసులో చెలరేగే భావాలను నావిగా చేసుకుంటూ, నీవు రాసే లేఖలోని, మధురభావాలకోసం, నీ తీయని మకరందం లాంటి మాటల కోసం ఎదురుచూస్తూ— నీవాడయిన నీ ఋషి.

లోకంలో ఎందరో రాజ్‌ఋషులు, కాబట్టే జ్ఞాపకాల బరువును మోస్తున్న గుండెలూ ఉన్నాయి. అటువంటి గుండెలలో తనదీ ఒకటి. బరువుగా నిట్టూర్చింది. ఆకాశంకేసి చూసింది రాధ. జ్ఞాపకాలతో బరువెక్కిన తనగుండెలాగే, ఆకాశం మేఘాల దొంతరలతో బరువుగా ఉంది.

ఇట్లు

ఐ.రంగ



ప్రపంచ సాహిత్యంతో పోల్చిచూస్తే లేఖాసాహిత్యం చాలా తక్కువ. ఇద్దరు వ్యక్తుల మధ్య ఆత్మీయంగా నడిచే లేఖ, సాహిత్యంలో కూడా ప్రముఖపాత్ర వహిస్తుంది.

తెలుగులో చలం, గోపీచంద్, గురజాడలు ముఖ్యంగా లేఖాసాహిత్యానికి దోహదం చేశారు. ప్రేమలేఖలు అందుకోవడం తేలికే గానీ రాయడం చాలా కష్టం. చలంగారు ప్రేమలేఖలు అనే గొప్ప పుస్తకం రాశారు. నేటి యువతీయువకుల దృష్టికి లేఖా సాహిత్యాన్ని తేవాలనే ఉద్దేశంతో ఉదయం నవతరం వారపత్రిక లో లేఖారచన పోటీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్నాం. వ్రాతలో రెండున్నర పేజీలకు (అరఠావుకు) మించని రచనలను ఆహ్వానిస్తున్నాము. ప్రచురించిన ఒక్కొక్క ఉత్తరానికి 100 రూపాయల చొప్పున బహుమతి ఉంటుంది. ఈఅవకాశాన్ని వినియోగించుకుని ఎక్కువ మంది యువతీ యువకులు ఈ పోటీలో పాల్గొంటారని ఆశిస్తున్నాము.

చిరునామా
ఉదయం నవతరం
వారపత్రిక
7/1, అజామాబాద్,
హైదరాబాద్ –20